జీవన్‌రెడ్డికి పొగ!

ఎర్రవల్లిలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ భానుప్రసాద్ తదితరులు

బీఆర్‌ఎస్‌కు ఒడిదొడుకులు కొత్తకాదు

- ఓపిక పడదాం.. ప్రజల్లో ఉందాం
- ప్రజాప్రతినిధులతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
- కేసీఆర్ వెంటే ఉంటాం: ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు
- త్వరలో పార్టీ పునర్నిర్మాణ కార్యాచరణ

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్‌కు ఒడిదొడుకులు కొత్తకాదని పార్టీ అధినేత కేసీఆర్.. తనను కలిసిన ప్రజాప్రతినిధులతో పేర్కొన్నట్టు తెలిసింది. తెలంగాణ ప్రజల యోగక్షేమాలే బీఆర్‌ఎస్ ఎజెండా అని, ఇలాంటి సమయంలో ఓపిక పట్టాలని పేర్కొన్నట్టు సమాచారం. సోమవారం పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్‌పర్సన్లు, నగర పాలక సంస్థ చైర్మన్లు ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను కలిశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం లేకపోవడం వల్ల విద్యుత్తు, తాగు నీటి సరఫరా వంటి అనేక అంశాల్లో నష్టం జరుగుతున్నదనే అంశాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని, పార్టీలోని అన్నిస్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా నేతలకు కేసీఆర్ సూచించినట్టు సమాచారం. కాగా, పార్టీని పూర్తిస్థాయిలో పునర్నిర్మించే కార్యాచరణకు కేసీఆర్ త్వరలో శ్రీకారం చుట్టనున్నారని, పార్టీలో అన్నిస్థాయిల శ్రేణులు, వివిధ వర్గాల నిపుణులతో సమాలోచనలు చేస్తున్నారని కేసీఆర్‌ను కలిసిన నేతలు స్పష్టంచేశారు. తాము ఎట్టిపరిస్థితుల్లో పార్టీ మారే సమస్యేలేదని, పార్టీ మారేవాళ్లమే అయితే కేసీఆర్‌ను ఎందుకు కలుస్తామని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కుండబద్దలు కొడుతున్నారు. కాంగ్రెస్ మైండ్‌గేమ్ అడుతున్నదని మండిపడుతున్నారు. బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషిచేస్తామని తేల్చిచెప్తున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, భానుప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వర్‌రావు, గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందమ్ చక్రపాణి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరు ప్రవీణ్, పలువురు కౌన్సిలర్లు కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. పార్టీ నుంచి గెలిచిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ఇటీవల కాంగ్రెస్‌లో చేరటం తమకు బాధ కలిగించిందని కేసీఆర్ వద్ద పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారని, ఆ సందర్భంలో ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని చెప్పి, బీఆర్‌ఎస్ ఆవిర్భవం నుంచి ఎదురైన అనుభవాలను వారికి కేసీఆర్ వివరించినట్టు సమాచారం. కాగా, అమెరికా పర్యటన ముగించుకొని తిరిగి వచ్చిన ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలవనున్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకు బీఆర్‌ఎస్!

మొదటిపేజీ తరువాయి...

బీఆర్‌ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలోనే ఆయనపై అనర్హతవేటు వేయాలని స్పీకర్‌ను కోరింది. స్పీకర్ తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని నిర్ణయం వెల్లడించకపోడంతో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర హైకోర్టు తలుపుతట్టింది. పార్టీ ఇచ్చిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకొని మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకొని, సదరు ఎమ్మెల్యేపై అనర్హతవేటు వేయాలనే నిబంధన ఉన్నది. ఎమ్మెల్యేల అనర్హతల విషయంలో స్పీకర్ నిర్ణయం, హైకోర్టు తీర్పు వెలువడని పక్షంలో సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమవుతున్నది. దానం నాగేందర్‌తోపాటు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ తదితరులు పార్టీ మారినందున వారిపై కూడా అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించే దిశగా సమాలోచనలు జరుపుతున్నది.

- కరీంనగర్ కాంగ్రెస్‌లో రేవంత్ చిచ్చు
- వ్యూహాత్మకంగానే సంజయ్‌కు ఆహ్వానం.. పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం
- భగ్గుమన్న జీవన్.. రాజీనామాకు సై
- రంగంలోకి అధిష్ఠానం
- జీవన్‌రెడ్డికి హామీ ఇచ్చేంత వాళ్లమా?:శ్రీధర్‌బాబు
- కార్యకర్తలతో చర్చించి నిర్ణయం: కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

భగ్గుమన్న జీవన్‌రెడ్డి

కరీంనగర్, జూన్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి/జగిత్యాల నమస్తే తెలంగాణ): జగిత్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కండువా కప్పి పార్టీలో చేర్చుకున్న వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో చిచ్చు రేపింది. సీనియర్ నాయకుడైన జీవన్‌రెడ్డిని వదిలించుకోవడంలో భాగంగానే సీఎం ఈ వ్యూహాన్ని అమలు చేశారన్న విమర్శలు సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. సీనియర్లను పక్కన పెట్టడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారని ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న రేవంత్‌రెడ్డి చేతలకు జీవన్‌రెడ్డి ఇలాకాలో జరిగిన తాజా పరిణామం కూడా ఒక ఉదాహరణే అన్న అభిప్రాయాలను సీనియర్లు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు సైతం పావులుగా మారగా, జీవన్‌రెడ్డి సమిధగా మారారు. ఊహించని ఈ పరిణామంపై జీవన్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఉదయమే శ్రేణులతో మాట్లాడిన ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తామని ప్రకటించారు. పరిస్థితి మరింత దిగజారే పరిస్థితి కనిపించడంతో రంగంలోకి దిగిన అధిష్ఠానం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. జీవన్‌రెడ్డిని చల్లబరిచేందుకు పొద్దంతా చర్చలు జరిపింది. ఇద్దరు విప్‌లను పంపి చర్చలు జరిపినప్పటికీ ఆయన ససేమిరా అనడంతో మంత్రులు మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. జీవన్‌రెడ్డి వారిపైనా ఆగ్రహం వ్యక్తంచేశారు. జీవన్‌రెడ్డికి జగిత్యాలపై మంచి పట్టుంది. ఈ తరుణంలో సంజయ్‌కుమార్‌ను ఎందుకు చేర్చుకోవాల్సి వచ్చిందన్న దానిపై పార్టీ శ్రేణుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీవన్‌రెడ్డిని వదిలించుకునే దిశగా అధిష్ఠానం అడుగులు వేసిందా? ఈ వ్యూహంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకత్వాన్ని పావులుగా వినియోగించిందా? జీవన్‌రెడ్డి, సీఎం ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కాబట్టి భవిష్యత్తులో తన పదవికి ముప్పు ఉంటుందన్న కుట్రలో భాగంగా సంజయ్‌ను చేర్చుకున్నా రా?అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తనతోపాటు పార్టీ శ్రేణులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే డాక్టర్ సంజయ్‌ను పార్టీలో చేర్చుకోవడపై జీవన్‌రెడ్డి భగ్గుమన్నారు. విషయం తెలుసుకున్న పార్టీ శ్రేణులు, అభిమానులు సోమవారం ఉదయమే పెద్ద సంఖ్యలో జీవన్‌రెడ్డిని ఆయన ఇంటివద్ద కలిసి ఆందోళన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తనకు మాటమాత్రమైనా చెప్పకుండా, తన అనుభవానికి కనీస విలువ ఇవ్వకుండా సీఎం వ్యవహరించారంటూ జీవన్‌రెడ్డి బాహటంగానే తన అసంతృప్తిని వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పార్టీని వీడే విషయమై మీడియాతో మాట్లాడతానని చెప్పడంతో మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం బుజ్జగింపులు మొదలుపెట్టింది. పలువురు మంత్రులు జీవన్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడినా ఆయన వినకపోవడంతో జిల్లాకు చెందిన విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్ ఆయన ఇంటికి వెళ్లి సంప్రదింపులు జరిపారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యేను చేర్చుకోవడం ఏమిటని ప్రశ్నించినట్టు సమాచారం. రేవంత్‌రెడ్డి తనపై ఎందుకు కక్షగట్టారో చెప్పాలని నిలదీసినట్టు తెలిసింది. తనకు సమాచారం ఇవ్వకపోవడానికి గల కారణం చెప్పాకే చర్చలు జరుపుదామని చెప్పినట్టు సమాచారం. కాంగ్రెస్ నేతలు బుజ్జగింపులు చేస్తున్నప్పటికీ మరోవైపు, జీవన్‌రెడ్డి మాత్రం భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్నట్టు సమాచారం.

విఫలనేతగా ముద్రవేసి

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో జీవన్‌రెడ్డి ఓటమి పాలయ్యాక ఆయనపై విఫలనేతగా ముద్రవేయడం ముందస్తు వ్యూహంలో భాగమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడాయన స్థానంలో డాక్టర్ సంజయ్‌ను తీసుకున్నట్టుగా చేసి, జీవన్‌రెడ్డిని వదిలించుకునే కుట్రకు తెరలేపారన్న ఆరోపణలు తెరపైకి వచ్చాయి. పార్టీయే సర్వస్వం అని భావించి పనిచేస్తున్న జీవన్‌రెడ్డి బయటి నుంచి ఎన్ని అవకాశాలు వచ్చినా పార్టీని వీడలేదు. ఆయనకు కనీసం సమాచారం ఇవ్వకుండా జరుగుతున్న పరిణామాలపై జీవన్‌రెడ్డి మద్దతుదారులు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై తాడోపేడో తేల్చుకోవాలని, అవసరమైతే గాంధీభవన్ ముట్టడిద్దామని పార్టీ శ్రేణులకు జీవన్‌రెడ్డి చెప్పినట్టు తెలిసింది. సీఎం పదవికి మాత్రమే ప్రాధాన్యం ఇచ్చిన రేవంత్‌రెడ్డి, విలువలు, పార్టీ కట్టుబాట్లకు తిలోదకాలు ఇచ్చి పచ్చి అవకాశవాద రాజకీయం చేస్తున్నారని చెప్పడానికి జీవన్‌రెడ్డి వ్యవహారమే నిదర్శనమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు 40 మంది సభ్యుల శాసనమండలిలో 39 మంది సభ్యులు బీఆర్‌ఎస్ వాళ్లు ఉన్నా, ఒకే ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి పోరాటం చేశారని గుర్తుచేస్తున్నారు. అలాంటి నాయకుడు కష్టకాలంలో ఉన్నప్పుడు ఆయనను కాదని, ఆయన ప్రత్యర్థిని పార్టీలోకి తీసుకోవడం చూస్తుంటే జీవన్‌రెడ్డి సీనియార్టీకి విలువ ఇవ్వలేదన్నది అర్థమవుతున్నదని చెప్తున్నారు.

జీవన్‌రెడ్డిని పక్కన పెట్టే వ్యూహమా?

40 ఏండ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన జీవన్‌రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మూడుసార్లు మంత్రిగా పనిచేశారు. ఒకసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. జువ్వాడి చొక్కారావు, ఎమ్మెస్సార్, శ్రీపాదరావు లాంటి వారి తర్వాత అత్యంత సీనియర్‌గా గుర్తింపు పొందారు. కాంగ్రెస్ పార్టీలో సోనియాగాంధీ నుంచి క్షేత్రస్థాయి వరకు ఆయనకు పరిచయాలున్నాయి. అలాంటి జీవన్‌రెడ్డికి మాటమాత్రమైనా చెప్పకుండా మరో పార్టీ ఎమ్మెల్యేను చేర్చుకోవడం రేవంత్‌రెడ్డి వ్యూహంలో భాగమేనని చెప్తున్నారు. నిజానికి పార్లమెంట్ ఎన్నికలకు ముందే డాక్టర్ సంజయ్‌కుమార్ ముఖ్యమంత్రిని కలిశారు. అప్పట్లోనే కాంగ్రెస్‌లో దీనిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసమే సీఎంను కలిశానంటూ ఆయన వివరణ ఇవ్వడంతో అప్పట్లో ఆ విషయం సద్దుమణిగింది. తాజా పరిణామాలు చూస్తుంటే మాత్రం ఇది అకస్మాత్తుగా జరిగిన చేరిక కాదని, వ్యూహాత్మకంగానే జరిగిందని అర్థమవుతున్నది.

రాష్ట్ర కిసాన్ సెల్ కో-ఆర్డినేటర్ సత్యంరెడ్డి రాజీనామా

మల్లాపూర్, జూన్ 24: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను కాంగ్రెస్ చేర్చుకోవడంపై కలత చెందిన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన కాంగ్రెస్ కిసాన్ సెల్ విభాగం రాష్ట్ర కో-ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఫ్యాక్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు తన రాజీనామా లేఖ పంపించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఎమ్మెల్సీగా నామినేషన్ వేసి గెలుపొంది ప్రజల గొంతుకగా నిలిచిన ఏకైక వ్యక్తి జీవన్‌రెడ్డేనని, అలాంటి నాయకుడిని అవమానించడం సరికాదని మండిపడ్డారు. రాష్ట్రస్థాయి కీలక నేతకు ఇచ్చే గౌరవం ఇది కాదని, ఇప్పటికైనా అధిష్ఠానం పునరాలోచించాలని సూచించారు. తనవంతు బాధ్యతగా రాష్ట్ర కో-ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేసి, సాధారణ కార్యకర్తగానే పనిచేస్తానని సత్యంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో చర్చలు జరుపుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, విప్ ఆది శ్రీనివాస్

జీవన్‌రెడ్డి వర్సెస్ శ్రీధర్‌బాబు

- మంత్రి శ్రీధర్‌బాబుపై జీవన్‌రెడ్డి ఫైర్
- సీఎంతో మాట్లాడేందుకు నిరాకరణ
- ఖర్గే దృష్టికి తీసుకువెళ్తాం: శ్రీధర్‌బాబు

జగిత్యాల, జూన్ 24, (నమస్తే తెలంగాణ): '200 కోట్ల రూపాయల నిధులు ఇచ్చి కండువా కప్పడం అవసరమా? ఇప్పుడు ప్రభుత్వానికి ఏమైంది? నా సీనియారిటీ, సిన్సియార్టీకి ఇచ్చే విలువ ఇదేనా? కార్యకర్తల కష్టాలు, మనోభావాలు అక్కర్లేదా?' అంటూ మంత్రి శ్రీధర్‌బాబు ఎదుట ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. జగిత్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడంపై కినుక వహించిన జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం తన ఇంటికి వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుపై జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.ఈ క్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు రెండుసార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడండి అంటూ జీవన్‌రెడ్డిని కోరినా, 'మాట్లాడను' అంటూ తిరస్కరించినట్టు సమాచారం.

ఏఐసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళ్తాం : మంత్రి శ్రీధర్‌బాబు

జగిత్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడంపై కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు తెలియజేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. జీవన్‌రెడ్డితో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ జీవన్‌రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్నారని, పార్టీ కష్టకాలంలో ఉన్న ప్రతీసారి పార్టీ మంచికోసం శ్రమించారని పేర్కొన్నారు. జీవన్‌రెడ్డికి ఏం హామీ ఇస్తున్నారని ప్రశ్నించగా, 'జీవన్‌రెడ్డే మాకు పెద్దదిక్కు ఆయనకు మేం ఏం హామీ ఇస్తాం' అని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగానే : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల మనోభావాలకు అనుగుణంగానే తన భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్వహణ విషయంలో స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ, సంఖ్యా బలం పెంచుకునేందుకు ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంటున్నారని, అయితే చేర్చుకునే సమయంలో అక్కడి కార్యకర్తల మనోభావాలను సైతం పార్టీ పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. పదేండ్లు ఎవరితో అయితే పోరాటం చేశామో అదే వ్యక్తిని పార్టీలో చేర్చుకోవడాన్ని కార్యకర్తలు, నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని తెలిపారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ఎమ్మెల్యే సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

జగిత్యాలలోని తహసీల్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొత్తగా ఫిరాయింపుల శాఖ మంత్రి?

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా 'ఫిరాయింపుల మంత్రిత్వశాఖ' ఏర్పాటు చేసి, దాని బాధ్యతలను ప్రత్యేకంగా ఒక మంత్రికి అప్పగించారంటూ రాజకీయ వర్గాల్లో జోకులు పేలుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు ముందు దానం నాగేందర్‌తో మొదలైన ఫిరాయింపుల ప్రక్రియ తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్ వరకు కొనసాగింది. ఇంకా కొంతమంది ఎమ్మెల్యేలు కూడా పార్టీ మారుతారని కాంగ్రెస్ బాహాటంగానే చెప్తున్నారు. ఈ వ్యవహారం మొత్తాన్ని ఒక మంత్రి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నట్టు చెప్తున్నారు. ఇప్పటికే రెండు కీలక శాఖలు నిర్వహిస్తున్న ఆ మంత్రికి.. అదనంగా ఫిరాయింపుల శాఖ కూడా అప్పగించారని సచివాలయంలో, కాంగ్రెస్ పార్టీలో సెటైర్లు వేస్తున్నారు. ఆయన చేతిలోని అత్యంత కీలకమైన శాఖను ఉన్నతాధికారులకు వదిలేశారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఆ శాఖపై అటు సీఎం, ఇటు ఉన్నతాధికారులే మాట్లాడుతున్నారని మంత్రి పట్టించుకోవడం లేదని ఆ శాఖ వర్గాలు వాపోతున్నాయి. మంత్రిని కలిసి విన్నవించినా ఫలితం ఉండటం లేదని సదరు శాఖ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు చెప్తున్నారు. మంత్రికి ' ఫిరాయింపుల శాఖ అదనపు' బాధ్యతలు పెరగడమే ఇందుకు కారణమని సెటైర్లు వేస్తున్నారు.

సంజయ్‌పై భగ్గుమన్న బీఆర్‌ఎస్

పార్టీ వీడడం ఆత్మహత్యకన్నా హీనమైన చర్య • స్వార్థంతో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే

ధ్వజమెత్తిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు • ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిరసనలు

జగిత్యాల/జగిత్యాల రూరల్/జగిత్యాల అర్బన్/ కోరుట్ల, జూన్ 24 : జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పార్టీని వీడడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాయి. జగిత్యాలలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు తహసీల్ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టి, ఎమ్మెల్యే సంజయ్ దిష్టిబొమ్మను తగలబెట్టారు. సంజయ్ ఇంటిని, దవాఖానను ముట్టడించారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో సంజయ్ దిష్టిబొమ్మను దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. మెట్‌పల్లిలోని పాత బస్టాండ్, రాజన్న సిరిసిల్ల జిల్లా , పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

జగిత్యాలలో తిరగనివ్వం: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

స్వార్థంతో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను జగిత్యాలలో తిరుగనివ్వబోమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. పౌరుషం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీలో నిలువాలని సవాల్ విసిరారు.

తల్లిపాలు తాగి రొమ్ము మీద గుద్దిండు: జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్

ఎమ్మెల్యే సంజయ్ తల్లి పాలు తాగి రొమ్ము మీద గుద్దాడని బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు మండిపడ్డారు. సంజయ్ వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన ఒకసారి ఓడినా రెండుసార్లు గెలవడానికి ఎమ్మెల్సీ కవిత ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.

నమ్మకద్రోహానికి ప్రతిరూపం: జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

నమ్మక ద్రోహానికి ప్రతిరూపం ఎమ్మెల్యే సంజయ్ అని జడ్పీచైర్‌పర్సన్ వసంత మండిపడ్డారు. బీఆర్‌ఎస్ గుర్తుతో గెలిచి, మరో పార్టీలో చేరడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

దమ్ముంటే రాజీనామా చెయ్ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

సంజయ్‌కుమార్‌కు దమ్ము, ధైర్యం ఉంటే రాజీనామా చేసి మళ్లీ పోటీకి రావాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సవాల్ విసిరారు. 2014, 2018, 2023లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చిన కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరడం దురదృష్టకరమన్నారు.

ప్రాణం ఉన్నంత వరకు పార్టీలోనే కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



ప్రాణం ఉన్నంత వరకూ బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల స్పష్టం చేశారు. కోరుట్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ గెలుపు కోసం బీఆర్‌ఎస్ శ్రేణులు ఎంతో కృషి చేశాయన్నారు. సంజయ్‌ని తన గురువుగా భావించానని, ఇప్పుడు ఆయనను చూసి సిగ్గుపడుతున్నట్టు చెప్పారు.

పార్టీ మారితే ప్రజాకోర్టులో శిక్ష ఖాయం

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు ప్రజాకోర్టు లో శిక్ష పడటం ఖాయమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ అన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్‌లో చేరడం అనైతిక చర్య అని ఆయన అభివర్ణించారు. డాక్టర్ సంజయ్‌కు బీఆర్‌ఎస్సే రాజకీయాలను పరిచయం చేసిందని, ఆయన విజయానికి ఎమ్మెల్సీ కవిత ఎంతో కృషి చేశారని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నది రాహుల్ కాంగ్రెస్సా? రేవంత్ కాంగ్రెస్సా ? చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి రాజేశం గౌడ్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగిత్యాలలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్ చౌరస్తాకు వస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

కరీంనగర్‌లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు వ్యతిరేకంగా నినదిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, పార్టీ నాయకులు

ప్రజల కండ్లల్లో కారం కొట్టిండు

- ఎమ్మెల్యే సంజయ్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు
- రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): కండ్ల డాక్టర్ అని కండ్లల్లో పెట్టి చూసుకుంటే ఎమ్మెల్యే సంజయ్ జగిత్యాల ప్రజల కండ్లల్లో కారం కొట్టారని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ ఆరోపించారు. సంజయ్‌ను గెలిపించేందుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రచారానికి వెళ్లి అస్వస్థతకుగురైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పార్టీ అధినేత కేసీఆర్ నమ్మకాన్ని, ప్రజల విశ్వాసాన్ని కాలరాసి కాంగ్రెస్‌లో చేరిన సంజయ్‌కు జగిత్యాల ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఆయన పేర్కొన్నారు.

3 నెలల్లో తేల్చాలి!

- ఫిరాయింపుదారుల అనర్హత వేటుపై ఈ వ్యవధిలో స్పీకర్ నిర్ణయించాలి
- మహారాష్ట్ర ఎన్సీపీ, శివసేన కేసుల్లో గతంలో సుప్రీం స్పష్టమైన ఆదేశాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఒక పార్టీ టికెట్‌పై గెలిచి మరో పార్టీలోకి ఫిరాయింపులకు పాల్పడిన ప్రజాప్రతినిధులపై దాఖలైన అనర్హత పిటిషన్లపై స్పీకర్లు మూడు నెలల వ్యవధిలో నిర్ణయం తీసుకోవాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పేర్కొంది. స్పీకర్ అలా చేయలేని పక్షంలో ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేయాలంటూ కోర్టును ఆశ్రయించే అవకాశం ఫిర్యాదుదారులకు ఉంటుందని గుర్తు చేసింది. ఈ మేరకు మహారాష్ట్రలో శివసేన (ఠాక్రే-షిండే), ఎన్సీపీ (శరద్ పవార్-అజిత్ పవార్) కేసులకు సంబంధించి ఈ ఏడాది మొదట్లో జరిగిన విచారణలో, 2020లో మణిపూర్‌కు చెందిన ఓ మంత్రి కేసులో సుప్రీం పలు కీలక ఆదేశాలు జారీ చేసింది.

స్పీకర్ అధికారాలకు పరిమితులు

రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లోని 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం' ప్రకారం.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకొనే అధికారం స్పీకర్‌కు మాత్రమే ఉంటుంది. అయితే ఈ నిర్ణయాన్ని స్పీకర్ ఈ పరిమిత సమయంలోపు తీసుకోవాలనే నిబంధన గతంలో లేదు. దీంతో రాజకీయ ప్రయోజనాలను అనుసరించి అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగేది. దీనిపై దృష్టిసారించిన సుప్రీంకోర్టు ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని త్వరగా అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్లకు డెడ్‌లైన్లు విధిస్తున్నది. మహారాష్ట్రలోని ఎన్సీపీని చీల్చి శివసేన (షిండే)-బీజేపీ ప్రభుత్వంలో చేరిన అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యేలపై ఎన్సీపీ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోగా (ఫిబ్రవరి 15) నిర్ణయం తీసుకోవాలని ఆ రాష్ట్ర స్పీకర్‌ను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. శివసేన (షిండే) ఎమ్మెల్యేలకు సంబంధించిన అనర్హత పిటిషన్లకు కూడా ఇదే తరహా డెడ్‌లైన్ (జనవరి 10) విధించింది. దీంతో ధర్మాసనం ఆదేశాలు పాటించకపోతే, కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందన్న భావనతో స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.

రాజకీయ భవిష్యత్తూ అంధకారమే!

ఫిరాయింపులకు పాల్పడే ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు పడటమే కాదు.. వారి రాజకీయ భవిష్యత్తు కూడా ఆగమాగమయ్యే పరిస్థితి ఉంటుందని మణిపూర్ మంత్రికి సంబంధించి సుప్రీం గతంలో ఇచ్చిన తీర్పును బట్టి అర్థమవుతున్నది. మణిపూర్‌కు చెందిన ప్రస్తుత బీజేపీ నేత తౌనోజామ్ శ్యామ్‌కుమార్ సింగ్ 2017లో కాంగ్రెస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచి బీజేపీలోకి జంప్ అయ్యారు. దీంతో మంత్రి పదవి దక్కింది. శ్యామ్‌పై అనర్హత వేటు వేయాలని 2017లో కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. మూడేండ్లపాటు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ కాలయాపన చేశారు. దీంతో ఈ కేసును 2020లో విచారించిన సుప్రీం.. శ్యామ్‌కుమార్‌ను మంత్రి పదవి నుంచి తొలగించడమే కాకుండా.. తాము ఉత్తర్వులు ఇచ్చే వరకూ శ్యామ్ శాసనసభలో అడుగుపెట్టకూడదని ఆదేశించింది. అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఈ సందర్భంగా కోర్టు ఆదేశించింది.